
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 సెప్టెంబర్ 2025



'పది' పారితోషికం పగటికలేనా? : యుటిఎఫ్

ప్రజాశక్తి – కడప అర్బన్ పదవ తరగతి పరీక్షల, మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికం పగటి కలలాగా మారిపోయిందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డిఇఒ షంషుద్దీన్ కు కలిసి మరోమారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ గత మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణ కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జరిగిన పదవ తరగతి మూల్యాంకన పారితోషికం కూడా చెల్లించలేదని తెలిపారు. సప్లమెంటరీ పరీక్షల పారితోషికం కూడా కలిపి వెంటనే చెల్లించాలని కోరారు. పారితోషికం చెల్లింపునకు చర్యలు తీసుకోకపోతే, లేని పక్షంలో భవిష్యత్తులో జరగబోవు అన్నిరకాల పరీక్షల విధులను బహిష్కరిస్తామని తెలిపారు. స్పందించిన డిఈఓ బిల్లులన్నీ పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చి వారం లోపు పారితోషికం చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బత్తాయి ధరలు ఢమాల్

- రైతులకు తీపి రోజులు వచ్చేనా
- ఆరు నెలల నుంచి ధరలలో కానరాని మార్పు
- టన్ను రూ.15 వేల నుంచి రూ. 20 వేల లోపే
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు





ప్రజాశక్తి - సింహాద్రిపురం

జిల్లాలో సాగవుతున్న బత్తాయి తోటల పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారుతుంది. జిల్లావ్యాప్తంగా గత ఏడాది 54 వేల ఎకరాలలో విస్తీర్ణంలో ఉన్న చీనీ తోటలు ఈ ఏడాది 40 వేల లోపు మాత్రమే సాగులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాయల పరిమాణం, నాణ్యతలో నెంబర్ వన్‌గా నిలిచిన పులివెందుల ప్రాంతం చీనీ రైతులకు నేడు గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు చీడపీడలు, మరోవైపు పెరిగిన కూలీల ఖర్చు, ఎరువుల ధరలతో రైతులు ఆశించిన ధరలు లభించకపోవడంతో కుదేలవుతున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరమూ వరలక్ష్మీ వ్రతం, వినాయక చవితి పండుగలకు ధరలు టన్నుకు రూ.30 నుంచి రూ.40 వేలతో తోటల వద్ద కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం టన్ను రూ.15 నుంచి రూ. 20వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం చేసినప్పటికీ పెరగని ధరలు

గత ప్రభుత్వం పులివెందులలో చీనీ కాయల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ రైతులకు ఆశించిన ధరలు లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ లేనప్పుడు వ్యాపారులే తోటల వద్దకు వచ్చి ధరలు నిర్ణయించి కొనుగోలు చేసేవారు. మార్కెట్‌లో మండి వారు వేసిన వేలం ధరకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాలలో తోటల వద్ద కంటే మార్కెట్లోనే తక్కువ ధరలకు కొనుగోలు చేసిన పరిస్థితులు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే కనుమరుగు కాక తప్పదు

గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి చీనీ సాగులో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత ధరలతో ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. టన్నుకు రూ.15 నుంచి రూ.20 వేలకు విక్రయిస్తే ఎకరాకు ఐదు టన్నులు కాయలు వస్తే అందులో సూట్ పోను రైతులకు మిగిలిన మార్కెట్లో అయితే 4.4 టన్నులు, తోటల వద్ద అయితే 3.25 టన్నులకు మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారు. ఇందులో కోత కూలీల ఖర్చు ఇతర ఖర్చులను సైతం రైతులే భరించాలని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చీనీ సాగు చేయడం చేసిన కష్టం పోను నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఎలాంటి సూటు లేకుండా టన్నుకు రూ 40 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్లో ధరల వివరాలు

పులివెందుల మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు కనిష్ట ధర రూ. 9700, మధ్యస్థ ధర రూ.14500, గరిష్ట ధర రూ.17600తో వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ మార్కెట్‌లో 47 లాట్లకు గాను 141 టన్నులు వచ్చాయి. అదేవిధంగా అనంతపురం మార్కెట్లో చీనీ కాయలు కనిష్ట ధర రూ. 8000, మధ్యస్థ ధర రూ.14000, గరిష్ట ధర ర. 18000 లతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ మార్కెట్‌కు 668 టన్నులు చీనీ కాయలు వచ్చాయి.


ప్రభుత్వ సహకారం తప్పనిసరి



ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో చీనీ సాగు గడ్డుకాలంగా మారింది. పెట్టిన పెట్టుబడులు సైతం రాని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వం స్పందించి టన్నుకు కనిష్ఠ ధర రూ 40 వేలు ఉండేలా చూడాలి.

- వి. అరవిందనాథరెడ్డి, రైతు సంఘం నాయకుడు, సింహాద్రిపురం.

కనుమరుగయ్యేలా ఉంది



గడిచిన మూడు సంవత్సరాల నుంచి చీనీ ధరలలో మార్పు కనిపించడం లేదు. గతంలో టన్ను రూ. లక్ష పలికిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం రూ. 30 వేలు దాటడం లేదు. ఈ నేపథ్యంలో సాగు వ్యయం పెరిగి నష్టపోతున్నాం. దీని కారణంగా చాలామంది రైతులు చీనీ తోటలను తొలగిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే చీనీ తోటలు కనుమరుగు అయ్యే అవకాశం ఉంది.

- సత్యంరెడ్డి, చీనీ రైతు ,గురజాల.

ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే
చర్యలు తప్పవు: కలెక్టర్

ప్రజాశక్తి - కడప

అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల భాధ్యతాయుతంగా, సహనంతో, సానుకూల దృక్పథంలో స్పందించ గలిగినపుడే ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరని, పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై కలెక్టర్, జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఎస్‌డిసి వెంకటపతి, జడ్‌పిటి సిఇఒ ఓబులమ్మలతో కలిసి ఆయా డివిజన్ల ఆర్‌డిఒలు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబందిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, వాటికి సరైన పరిష్కార నివేదికలు కూడా అందడం లేదని పేర్కొన్నారు. సంబంధిత మండల తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పట్ల విచారి ంచాలని చెప్పారు. పరిష్కార నివేదిక అందివ్వడంలో పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని పేర్కొన్నారు. ఈ విషయంలో జిల్లా శాఖాధిపతులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలనన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వారి వారి కార్యాలయ వ్యవస్థను అందుకు అనుగుణంగా సిద్ధం చేసుకుని నిర్ణీత గడువు లోపల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత తో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సత్ఫలితాలు లభిస్తుందన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్ పై సమీక్షించి పూర్ పర్ఫార్మెన్స్ రికార్డు నమోదైన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని శాఖలల్లో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు '0' స్థాయిలోకి వచ్చేలా... పునఃపరిశీలించి ఫిర్యా దులను పరిష్కరించాలన్నారు. మండల స్థాయి అధికారులతో ప్రతివారం, జిల్లా స్థాయిలో 15 రోజులకు ఒకసారి పెండెన్సీని పూరించేందుకు సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. జెసి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణలో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లేముందు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని, అవసరమనుకున్న చోట ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహి ంచాలని తద్వారా మంచి ఫలితాలను అందు కోగలం అన్నారు. కార్యక్రమంలో ఎ శాఖల జిల్లాస్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఒంటిమిట్టను ఆధ్యాత్మిక
పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకి ఒంటిమిట్ట ప్రజా పరిషత్ సభా భవనంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి అక్కిశెట్టి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అజెండా ప్రకారం అన్ని శాఖల అధికారులు మాట్లాడాలని ఎంపిడిఒ ఆదేశించారు ముందుగా ఇరిగేషన్ అధికారి మాట్లాడుతూ మండ లానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన పెన్నానది స్కీమ్ కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అనంతరం ఉపాధి, విద్యుత్, ఆరోగ్యశాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల పనితీరు, చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్ రాజు మాట్లాడుతూ ఒంటిమిట్ట గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమని ఇక్కడ జరిగే నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏడాది ముఖ్యమంత్రి అధికారలాంచనలతో వస్తారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు అని అన్నారు. ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతలపథకం ద్వారా నీరందించే కార్యక్రమం వేగవంతమవుతోందన్నారు. గత ప్రభుత్వంలో చేసినటువంటి తప్పులు వల్ల నాసిరకం పైపులు వేయడంతో చెరువు నీటిని సరఫరా చేసే సమయంలో పైపులు పగిలిపోతున్నాయని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం రూ. 12 కోట్ల వ్యయంతో ఇనుప పైపులు వేసి ఒంటిమిట్ట చెరువుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కగా నీటిని అందించే కార్యక్రమాన్ని టిడిపి ప్రభుత్వం చేపడుతుందని జగన్మోహన్ రాజు అన్నారు. జడ్‌పిటిసి ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపైప నమ్మకం నుంచి ఓట్లు వేసి నటువంటి ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మండలాభివృద్ధికి తనవంతు ప్రయత్నిస్తానని కూడా ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు నారాయణరెడ్డి, బాషా, మాధవరం గీత కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, సర్పంచులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రసాభాసగా సర్వసభ్య సమావేశం
- దుమ్మా కొట్టిన అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

నరసాపురంలోని శ్రీ శక్తి భవన్‌లో మండల సర్వసభ్య సమావేశం బుధవారం రసాభాసగా సాగింది. సమావేశానికి మొత్తం 22 మంది మండలాధికారులు హాజరు కావాల్సి ఉండగా వారికి బదులు విఆర్ఒలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు అటెండర్లు రావడంతో ఎంపిడిఒ మైథిలి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీశాఖలు చెందిన అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఏ ఒక్క అధికారి హాజరు కానప్పుడు ఇక సమావేశం ఎందకని సర్పంచులు, ఎంపిటిసిలు ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహించడం, 15 రోజుల ముందు అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇవ్వమని అడిగితే ఏ ఒక్కరూ ఇవ్వకపోవడం సరికాదన్నారు. సమావేశంలో కొంత మంది అధికారులు చెప్పే సమాధానం సరిలేక ప్రజా ప్రతినిధులు మధ్యలోనే వెళ్లిపోయారు. తరువాత సర్పంచులు, ఎంపిటిసిలు తమ సమస్యలను సమావేశంలో వివరించారు. కత్తెరగుండ్ల పంచాయి చెన్నవరంలో సర్వేనంబర్ 1601,1617లో 4 ఎకరాల 19 సెంట్లు విస్తీర్ణం ఉందని అందులో ఒక ఎకరం దూదేకుల శ్మాశాన వాటికకు కేటాయించారని, దానిని ప్రస్తుతం అగ్రకులస్తులు ఆక్రమించారని, తిరిగి ప్రజలకు ఇప్పించాలని ఎంపిడిఒను అడగ్గా ఎవరూ ఆక్రమించకుండా వెంటనే నోటీస్ బోర్డు వేయాలని విఆర్ఒను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎంపిపి నల్లేరు పోలమ్మ, జడ్‌పిటిసి సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆచారి, డివిజనల్ సర్వేయర్ పుల్లయ్య, మండల మెడికల్ ఆఫీసర్ పుష్ప, విద్యాశాఖ అధికారి నిర్మల, పంచాయతీరాజ్ ఎఇ పుల్లయ్య, డిప్యూటీ ఎంపిడిఒ ముజఫర్ రహీం, అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, విద్యుత్ ఎఇ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పుట్టుకతోనే లోపాలను గుర్తించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

పుట్టకతో ఉన్న లోపాలను గుర్తించి త్వరగా చికిత్స అందిస్తే కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 'రీజనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ – ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్' కార్యక్రమాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలు, పుట్టుకతో లోపాల మీద ఎర్లీ ఐడెంటిఫికేషన్, ఎర్లీ డిటెక్షన్ ప్రాముఖ్యతను తెలిపారు. జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాల భవిత కేంద్రంలో ఇచ్చే సేవలు, అవసరమైన ప్రతి ఒక్క పిల్లవాడికీ అందేలా చూసే బాధ్యత అందరిదని చెప్పారు. సమావేశంలో డీన్ డాక్టర్ రాజన్ శుక్ల, డాక్టర్ కిరణ్, డాక్టర్ వంశీధర్, నవీన్ కుమార్, డాక్టర్ వందన, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సంసిద్ధం కావాలి : సిపిఎం

ప్రజాశక్తి-కాశినాయన

కార్మికులు, రైతులు, పేదలు తమ హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సంసిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ హాలలో మండల కమిటీ విస్తృత సమావేశం మండల అధ్యక్షులు ఎస్. భైరవప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల అమలు కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని చెప్పారు. విదేశాల నుండి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకునే దుర్గతికి దిగజారింది వాపోయారు. దిగుమతి సుంకాలు అమెరికా అధ్యక్షులు ట్రంప్ 25 శాతం నుండి 50 శాతానికి ఒకే మారు పెంచారని, ఈ భారం దేశ ప్రజలపై పడనుందని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి, ఎన్‌డిఎ పభుత్వానికి, రాష్ట్రంలోని టిడిపి, జనసేన ప్రభుత్వం గుడ్డిగా సమర్థిస్తోందని ఎద్దేవా చేశారు. ఈనెల 8న కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ సర్కిల్ నుంచి పాత బస్టాండ్ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి కేరళ ప్రభుత్వ చైర్ పర్సన్ విజయ రాఘవన్ హాజరవుతున్నారని తెలిపారు. 9, 10, తేదీలలో 22 రాష్ట్రాల నుంచి వచ్చిన రెండు వందల మంది ప్రతినిధులఓ జాతీయ కౌన్సిల్ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశాల్లో భవిష్యత్ కార్యక్రమం రూపొందించి పాలక ప్రభుత్వాల ముందు ప్రత్యమ్నయ మెరుగైన విధానాలు పెడతారని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.గౌసియా బేగం, మండల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మేరీ, బీబీ, ఓబులమ్మ, రఫైల్, రవి, రాజు, దస్తగిరి అమ్మ, సిపిఎం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘు, బండి జకరయ్య పిలుపునిచ్చారు. బుధవారం కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో ఈనెల 8న ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. 9, 10 తేదీలలో జాతీయ సమావేశంలో ఈ దేశంలో నిరుద్యోగం, పారిశ్రామిక, వ్యవసాయ రంగం అనేక అంశాల మీద చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని నివేదికల సమర్పించి పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉదయ్ పాల్గొన్నారు. **అట్లూరు :** కడపలో ఈనెల 8,9,10 తేదీల్లో నిర్వహించే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు జయప్రదం చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎస్. వెంకటాపురంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ ఆధ్వర్యంలోజాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం అట్లూరు మండలం అధ్యక్ష కార్యదర్శులు ఇ. రమణయ్య, ఎ. దుర్గమ్మ, శివ, నరసింహులు, మారయ్య, స్వప్న, ఆదిలక్ష్మమ్మ, సరస్వతి, అచ్చమ్మ, సుబ్బలక్ష్మమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ, అయ్య వారమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాసమస్యలను విధిగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-అట్లూరు : మండలంలోని గ్రామాల వారిగా ప్రజా సమస్యలను విధిగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎంపిపి రమాదేవి, ఎంపిడిఒ వెంగ మునిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అస్థానిక శ్రీ శక్తి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి హాజరై మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు నెలలకు ఒకసారి నిర్వహించే అభివృద్ధి కమిటీ సమావేశాలకు కమిటీ సభ్యురాలుగా తనను ఎందుకు పిలవలేదని, అలాంటప్పుడు ఎలా సంతకాలు పెట్టాలని వైద్య అధికారిని అమీదా బేగంను ప్రశ్నించారు. అనంతరం ఎంపిడిఒ జోక్యంచేసుకొని ఇకమీదట అలా జరగకుండా చూడాలని అధికారులందరికీ తెలియజేశారు. ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సమావేశం దృష్టికి తీసుకువస్తే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అధికారులు శాఖల వారీగా సమావేశంలో అజెండాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎఒ రామకృష్ణయ్య, మండల ఉపాధ్యక్షులు రాజవోలు సుబ్బారెడ్డి, ఎంపిటిసిలు చిన్న, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, కో – ఆప్షన్ సభ్యులు మాబు, సర్పంచులు ఆర్.వి.సుబ్బారెడ్డి, రమణ, సుబ్బయ్య, సిహెచ్ఒ మురళీకృష్ణ, ఎపిఒ జయచంద్ర, ఎపిఎం సురేష్, హౌసింగ్ శ్రీనివాసులు , కమలాకూరు పశు వైద్యాధికారి పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ కేంద్రాన్ని నూతనంగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని చెన్నూరు బస్టాండ్‌లో ఉన్న జిల్లా సైన్స్ కేంద్రాన్ని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, గౌరవ సలహాదారుడు పిళ్లా కుమారస్వామి రెడ్డి సందర్శించారు. జిల్లా సైన్స్ కేంద్రం చాలా అధ్వాన్న స్థితిలో ఉండడాన్ని చూసి వారు ఆందోళన చెందారు. జిల్లా సైన్స్ కేంద్రం లోపలికి ప్రవేశించే ముందర అక్కడ ఒక టాయిలెట్ ఉండడం, దాని దుర్వాసన లోపలి కొడుతూ ఉండడం గమనించారు. జిల్లా సైన్స్ కేంద్రం లోపల పరిసరాలు అంతా అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. కరోనా కాలం నుంచి ఎవరికి ఆ పరికరాలను చూపించిన దాఖలాలు లేవని చెప్పారు. అక్కడ విద్యార్థులు పోవడానికి కూడా అనుకూలమైన పరిస్థితులు లేకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు.


కొద్ది రోజులు ఓపిక పట్టండి : జగన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొద్ది రోజులు ఓపిక పట్టండి వచ్చేవన్నీ మంచి రోజులే అని, వైసిపి నాయకులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం పట్టణంలోని తన నివాసం వద్ద పలువురు నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలు ఆయన కలిసి కూటమి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలు ఎక్కువయ్యాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బాధలు, కష్టాలు, సమస్యలు కొద్దిరోజులేనని తాను ఉన్నానంటూ భరోసా ఇచ్చి ధైర్యాన్ని నింపారు.

జగన్‌ను కలిసిన తౌహీద్‌ఖాన్

కడప అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డిని బుధవారం ఇడుపులపాయంలో వైసిపి ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు పటాన్ తౌహీద్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తౌహీద్ ఖాన్ సేవలు పార్టీకి ఎంతో అవసరమని జగన్ అన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తౌహీద్ ఖాన్ మాట్లాడుతూ పార్టీకి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.


జగన్‌తో తౌహీద్‌ఖాన్

నేటి నుంచి ఉల్లి కొనుగోలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇ – క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ఉల్లి కొనుగోలుకు ప్రభుత్వం జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్ ఫెడ్ అనుమతి మేరకు క్వింటాలు రూ.1,200 కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కమలాపురం, మైదుకూరులో కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు ఇంటి వద్దనే శుభ్రం చేసుకుని తీసుకురావాలని పేర్కొన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జెవివి రాష్ట్ర18వ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జెవివి రాష్ట్ర 18వ మహాసభలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్ బాషా, శివరాం పిలుపునిచ్చారు. బుధవారం జెవివి కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు విజయనగరం జిల్లాలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 13,14 తేదీల్లో ఉంటాయని తెలిపారు. సభలకు మేధావులు, విద్యార్థులు, మహిళలు, సాహిత్యకారులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి రాజశేఖర్ రాహుల్, సరస్వతి, వెంకటరమణ రాజు, నగర కార్యదర్శి నరసింహ రెడ్డి, గౌరవ సలహాదారు పిల్లా కుమార్ స్వామి రెడ్డి, మల్లెల భాస్కర్ పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా కడప జట్టు

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా బుధవారం రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 81.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 304 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని నాగచాతుర్య 53, విజయ్ రామిరెడ్డి 62 (నాట్ అవుట్), శివ కేశవ 43, ఆయుబ్ 36 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని తనీష్ 3 వికెట్లు తీసుకున్నాడు.

ఎల్ఐసిని బలోపేతం చేస్తాం : ఎస్‌డిఎం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎల్ఐసిని బలోపేతం చేయడమంటే దేశాన్ని బలోపేతం చేయడమే అని ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ అన్నారు. బుధవారం బీమా వారోత్సవాల సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బీమా రక్షణ కల్పిస్తూ దేశంలో 27 కోట్ల మందికి వ్యక్తిగత పాలసీల ద్వారా సేవలందిస్తున్నదని తెలిపారు. ఎల్ఐసి దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు రూ.51 లక్షల కోట్లు పైబడి పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. ఎల్ఐ.సి సంస్థ కోసం పని చేసే 14.86 లక్షల ఎజెంట్ లలో 49శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల నుంచే వచ్చారని పేర్కొన్నారు. మహిళా ఏజెంట్ల సంఖ్య మూడు లక్షలు పైగా ఉంటే తాజాగా బీమా సఖి పేరుతో 2 లక్షలకు పైగా మహిళా ఎజెంట్‌లను ఎల్ఐసి నియమించిందని తెలిపారు. ఎల్ఐసి సంస్థ దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉందని చెప్పారు. తొలుత ఎల్ఐసి జెండా ఊపి అయిన ర్యాలీ ప్రారంభించారు.

సిద్ధవటం కోట ఉత్సవాలు నిర్వహించాలి
- గౌరవ అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లాకు పూర్వం జిల్లా కేంద్రంగా వెలుగొందిన సిద్ధవటం కోట చరిత్ర ఎంతో గొప్పదని, ప్రభుత్వం ప్రతి సంవత్సరమూ కోట ఉత్సవాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవ అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంత రావు అధికారులను కోరారు. బుధవారం కడపలోని కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక పితామహుడు సంస్థ వ్యవస్థాపకులు సిద్ధవటం సీతారామయ్య ఆశయాల సాధనకు సంస్థ పని చేస్తుందని చెప్పారు. సిద్ధులు, రుషులు , యోగుల ఆవాసమైన సిద్ధవటం తాలూకా ప్రాంతంలో రాష్ట్రంలో ఎక్కడ లేనన్ని శివాలయాలు, ప్రాచీన దేవాలయాలు, శాసనాలు, శిల్ప సంపద ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని కళాకారులను ఏకం చేసేందుకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు తమకు దగ్గరలో ఉన్న ప్రాచీన పర్యాటక ప్రదేశాల వద్ద ప్రదర్శన చేసి ఎంట్రీలను పంపాలని సూచించారు. ఇందులో ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ టైటిల్ గెలుచుకునేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. వివరాల కోసం 83 09710250లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి మురికి నాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : జెవివి

ప్రజాశక్తి కడప అర్బన్ : పిల్లలు తగిన పౌష్టికాహారం తీసుకోకపోతే రక్త, బలహీనతకు గురై అనేక వ్యాధులకు గురవుతారని డాక్టర్ దివ్యరాణి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'మన పిల్లలే మన ఆస్తి– భవిష్యత్తువారి ఆరోగ్యాలను కాపాడుకుందాం' అనే నినాదంతో ప్రత్యేక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన ఆహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. శాస్త్రీయ అవగాహనతో ప్రతి కుటుంబంలో పౌష్టికాహార అలవాట్లను పెంపొందించాలని కోరారు.

6న చలో విజయవాడ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు నగర అధ్యక్ష కార్యదర్శులు సుమన్, మోహన్ తెలిపారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కడప నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌టి హాస్టల్‌లో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు ఏమి కూడా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని చెప్పారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు పై ఎస్ఎఫ్ఐ ఇప్పటికే దశల వారి పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కార్తీక్, నవీన్, నగర నాయకులు మనోహర్, పండు, జస్వంత్ పాల్గొన్నారు.

ఇస్తిమాకు సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో 2026 జనవరిలో నిర్వహించే ఇస్తిమా కార్యక్రమానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలంటూ ముస్లిం పెద్దలు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. దాదాపు 5 లక్షలమంది ముస్లిం సోదరులు పాల్గొనే ఈ భారీ ఇస్తిమా కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, నీటి సరఫరా, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన నాయకులు ముస్లిం పెద్దలు సూచించిన సమస్యలపై తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

'స్త్రీ శక్తి' విజయవంతం : టిడిపి

ప్రజాశక్తి కడప అర్బన్ : స్త్రీ శక్తి పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి అన్నారు. బుధవారం నగరంలోని అక్కాయపల్లి వద్ద ఉన్న టిడిపి జిల్లా కార్యాలయ ప్రాంగణంలో సూపర్ సిక్స్–సూపర్ హిట్ లో భాగంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం, సాధికారత కోసం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం కడపలో విజయవంతంగా అమలవుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా దూషిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం మైలవరం ఎంఇఒలు చిట్టిబాబు, శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యకరంగా విద్యార్థినులను చిన్నచిన్న తప్పులకు తిడుతున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు. అసలు జరిగిన సమస్య పక్కన పెట్టి సమస్యను పక్కదోవ పట్టించే విధంగా విచారణ జరుగుతోందని మండల విద్యాశాఖ అధికారులపై పలు ఆరోపణలు వస్తున్నాయన్నారు. స్కూల్‌లో పాములు సంచరిస్తున్నాయన్నారు. ఏదైనా విద్యార్థులకు జరుగుతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎంపిపి, జడ్‌పిటిసి నిధులతో మండలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వేముల

మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధికి ఎంపిపి, జడ్‌పిటిసి నిధులతో ప్రత్యేక చొరవ చూపిస్తున్న ఎంపిపి చల్లా గంగాదేవి, జడ్పీటీసీ కోకటం వెంకట బయప్ప రెడ్డి పేర్కొన్నారు. వేముల ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. మండలంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో వీధిలైట్లు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎఒ జిఓ ఓబులేసు మాట్లాడుతూ రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ ఎఇ అబ్బాస్ మాట్లాడుతూ మండలంలో వివిధ నిధులతో చేపట్టిన పనుల వివరాలను సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, నీలావతి, లక్ష్మీదేవి, కో-ఆప్షన్ సభ్యులు మండి మా పీరా, సర్పంచ్‌లు నాగేశ్వర్ పార్వతమ్మ, మూలి చెన్నారెడ్డి, రామాంజనేయ రెడ్డి, రంగనాథ్, సాకే రమాంజనమ్మ, అర్జున్, మణికంఠ, ఈశ్వర మధుసూదన్ రెడ్డి, ఏపిఎం ఆంజనేయులు, డాక్టర్ శరణ్య, పలువురు అధికారులు హాజరైనా, పంచాయతీ సెక్రటరీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా సహకార సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం సొసైటీ నూతన కార్యాలయాన్ని స్థానిక సిఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మల్లెల నరసింహారెడ్డి, డైరెక్టర్లు మేకల సుదర్శన్, గోసుల వీరారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పాత భవనం పూర్తిగా దెబ్బతిందని, వర్షానికి రికార్డులు, సామగ్రి పాడవుతున్నాయని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు అద్దె భవనంలోకి కార్యాలయాన్ని మార్చామన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో నూతన భవనాన్ని, సొసైటీ స్థలంలో వ్యాపార సముదాయానికి గదులు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డిసిసి మైదుకూరు బ్రాంచ్ మేనేజర్ సుబ్బారెడ్డి, సీఈఓ జాన్, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ వేమారెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మనిశేఖర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, జగదీశ్వర్, శేఖర్‌రెడ్డి, సలీం, నారపరెడ్డి, సిబ్బంది రంగా, నాయకులు పాల్గొన్నారు.



నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

చంద్రబాబు పాలనలో సంపదంతా ఆవిరి

ప్రజాశక్తి - వేంపల్లె

సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తున్నారని, వాస్తవంగా చూస్తే అందుకు బదులు సంపద ఆవిరి అయిపోతోందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పులు చేయడంలో గత వైసిపి ప్రభుత్వం, టిడిపి కూటమి ప్రభుత్వం దొందూదొందేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కె.రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణను పాటించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి పోకుండా కాపాడినట్లు చెప్పారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణను పాటించకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించాయని తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శక్తికి మించి అప్పులు చేయకుండా, ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని టిడిపి కూటమి ప్రభుత్వానికి తులసిరెడ్డి సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ సీతారాంరెడ్డి హెచ్చరించారు. కడప రిమ్స్ సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీల్లో పులివెందులకు వచ్చారు. ఆ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలువురు నాయకులు, టిడిపి హజ్ కమిటీ మెంబర్ మా బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఖాసీం వలి సీఐని శాలువాతో ఘనంగా సత్కరించారు.



సిఐని సత్కరిస్తున్న నాయకులు

కల్లూరి రామచంద్రారెడ్డి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్లూరు రామచంద్రారెడ్డి సేవలు ప్రశంసనీయమని ఎంఇఒ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. రామచంద్రారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఒ పాల్గొన్నారు. అభినందన సభను పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు కల్లూరు రామ చంద్రారెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు, బంధు మిత్రులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ-1 వెంకట సుబ్బయ్య, ఎంఈఓ-2 రవికిరణ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా, పారిశ్రామిక శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ రాధాకృష్ణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో వేంపల్లి బాలుర పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, నాగలగట్టుపల్లె హెచ్‌ఎం సూర్య నాగమునిరెడ్డి, వేంపల్లి గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం నాగాంజనేయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంగమేశ్వర్‌రెడ్డి, రామాంజనేయ ప్రసాద్, శివారెడ్డి, ఎరుకలరెడ్డి, చెరుకూరి శ్రీనివాసులు, అమర్నాథ్‌రెడ్డి, హెల్త్ డిపార్ట్మెంట్ సిద్ధ రాంప్రసాద్ పాల్గొన్నారు.



రామచంద్రారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యూరియా కోసం ఎదురుచూపులు

డిమాండ్ పెరగడంతో చాటుగా బస్తా రూ.400తో అమ్మకాలు-రైతుల్లో ఆందోళన



చాపాడులో ఓ ఎరువుల దుకాణం వద్ద ఎరువుల కోసం వేచివున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

యూరియా కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రస్తుతం కేసీ కెనాల్, కుందూ పరిధిలో మండల వ్యాప్తంగా 14,000 ఎకరాల్లో వరి సాగు చేపడుతున్నారు. ఇప్పటికే 10,000 ఎకరాలకు పైగా వరి పంట సాగు పూర్తయింది. వారం. పది రోజుల్లో పూర్తిస్థాయిలో వరి పంట సాగు పూర్తవు తుందని రైతులు పేర్కొంటున్నారు. వరి పంటకు ఉపయోగించేందుకు రైతులు ఇతర ఎరువులతోపాటు యూరియాను ఉపయోగిస్తారు. ఇదే అదునుగా వ్యాపారస్తులు యూరియా డిమాండ్ సృష్టిస్తున్నారు. గత వారంలో బస్తాను రూ.270 నుంచి రూ.380 వరకు అమ్మకాలు చేపట్టారు. కలెక్టర్, విజిలెన్స్, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించడంతో ఒక్కసారిగా యూరియా అమ్మకాలను నిలిపివేశారు. మూడు రోజులుగా రైతులకు యూరియా అందని ద్రాక్షగా మిగిలింది. చాపాడు, మైదుకూరు దుకాణాలలో రైతులు యూరియా కోసం తిరుగుతూ అందుబాటులో లేక వెను దిరుగుతున్నారు. ఒక్కసారిగా యూరియా లేదంటూ రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు మాత్రం యూరియా కొరత లేదని ప్రకటనలు చేస్తున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం ఒక బస్తా కూడా నిర్ణయించిన ధరకు అందుబాటు కావడంలేదు. గత వారంలో నిర్వహించిన దాడుల దాటికి ప్రతి దుకాణం ఎదుట రూ.206.50కే యూరియాను అమ్మకం చేస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉండగా కొన్ని దుకాణాల్లో రాత్రి సమయంలో బస్తా రూ.400తో అమ్మకాలు చేపడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. యూరియాను స్థానికంగా దుకాణాల్లో కాకుండా వారికి సంబంధించిన ప్రయివేట్ అనధికారిక గోడౌన్‌లలో నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం. విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా దుకాణాల్లోకి వెళ్లి తనిఖీలు చేసినట్లు ఫొటోలు దిగి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి రైతులకు యూరియా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పది రోజులుగా ఎక్కడా యూరియా పంపిణీ చేసిన దాఖలు లేవు. ప్రభుత్వం తరపున రైతు సేవా కేంద్రాల్లో యూరియాను పంపిణీ చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా ఎంఆర్పీ ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

యూరియా అందుబాటులో ఉంచాలి..



ఇటీవల యూరియా కోసం అన్ని దుకాణాల చుట్టూ తిరుగు తున్నాం. చాపాడులో యూరియా అందుబాటులో లేకపోవడంతో మైదుకూరు దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ కూడా యూరియా అందు బాటులో లేకపోవడంతో వరి పంటకు ఎరువు చల్లడం నిలిపివేయాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి యూరియాను రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేపట్టాలి. దుకాణాల్లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. **- లక్ష్మీనారాయణ, రైతు, నెర్రవాడ**

యూరియా కోసం ఎదురు చూస్తున్నాం..



యూరియా కోసం ఎదురుచూస్తున్నాం. మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశాం. ప్రస్తుతం మొదటి విడత సత్తువ చల్లేందుకు యూరియా అవసరం. ఎరువుల దుకాణాల్లో అడిగిన యూరియా అందుబాటులో లేదు. రైతు సేవ కేంద్రాల్లో కూడా యూరియా పంపిణీ చేపట్టడం లేదు. అధికారులు స్పందించి యూరియాను అందుబాటులో ఉండేలా చూడాలి.

- స్వామి దాసు, రైతు, పల్లవోలు

అధిక ధరకు యూరియా అమ్మకాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణంలో ఎరువుల దుకాణాల యజమానులు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. అధిక ధరలకు ఎరువులను అమ్ముతూ రైతన్న నడ్డి విరుస్తున్నారు. కొద్దిరోజుల నుండి యూరియా కొరత ఉందని రైతులకు చెబుతూ.. గోడౌన్లలో స్టాక్ పెడు తున్నారనే ఆరోపణలున్నాయి. బయట ఎరువులు తెచ్చి అమ్మాలంటే రైతులకు భారం పడుతుందనే ఉద్దేశ్యంతో తేవడం లేదని కొందరు దుకాణా దారులు పేర్కొంటున్నారు. మరి కొందరు దుకాణదారులు రూ.260 నుంచి రూ.270 చేసే బస్తా యూరియాను రూ.400, రూ.420కి విక్రయి స్తున్నారనే ఆరోపణలున్నాయి. డిఎపి, ఫాస్పేట్, క్రిమి సంహారక మందులు సైతం అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇష్టానుసారంగా దుకాణ దారులు అమ్ముతుంటే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు వాపో తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయాధికారులు స్పందించి గోడౌన్లలో తనిఖీ చేసి సరసమైన ధరలకు అమ్మేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమతి పొందిన ఉత్పత్తులనే విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి కలిగిన ఉత్పత్తులను మాత్రమే రైతులకు విక్రయించాలని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ శివన్న, ఎఫ్ఆర్ఒ మురళీకృష్ణ డీలర్లకు సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఎఒ వెంకటకృష్ణారెడ్డితో కలిసి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, గోడౌన్లో స్టాక్ నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించాలన్నారు. యూరియా అమ్మేటప్పుడు వేరే ఎరువులతో లింకు లేకుండా అమ్మాలన్నారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేసి, డిబిటి మిషన్ ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందిస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్, పోలీసు సిబ్బంది టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.



గోడౌన్‌లో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి



కొండారెడ్డికి సమస్యలు విన్నవించుకుంటున్న కార్మికులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, వెంటనే చెల్లించాలని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఆసుపత్రి కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. ఆ మేరకు బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో టిడిపి నాయకుడు నంద్యాల కొండారెడ్డికి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు ఒప్పందం ప్రకారం రూ.16,400 ఇవ్వాల్సి ఉండగా.. కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి రూ.12,400 మాత్రమే చాలా ఏళ్ల నుంచి ఇస్తున్నారన్నారు. సక్రమంగా పిఎఫ్ కూడా జమ చేయడం లేదన్నారు. అడిగితే బెదిరింపులకు కాంట్రాక్టర్ పాల్పడుతున్నాడన్నారు. నిబంధనల మేరకు ప్రతి నెల ఐదో తారీఖున వేతనాలు ఇవ్వాలని, మూడు, నాలుగు నెలల కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌తో ప్రతిసారి కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆరోపించారు. కార్మికుల సమస్యలు వెంటనే తీర్చాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అధ్యక్షులు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు మల్లి, చెన్నమ్మ, రాణి, లక్ష్మీ, మల్లమ్మ, దుర్గ, కార్మికులు పాల్గొన్నారు.

కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమే

ప్రజాశక్తి - వేంపల్లె

కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమని, కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆప్తాల్మిక్ అధికారి రెడ్డెన్న తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎపి ఉర్దూ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 420 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా, వారిలో 31 మందికి కంటి లోపం ఉన్నట్లు ఆప్తాల్మిక్ అధికారి రెడ్డెన్న తెలిపారు. వీరికి కంటి అద్దాలు అవసరమన్నారు. ప్రభుత్వం కంటి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగానే కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తాళ్ళపల్లె పిహెచ్‌సి వైద్యులు సుభాషిణి, నిహారిక, శాంతి, సిహెచ్‌ఒలు వెంకటరత్నం, ఫయాజ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నిసా బేగం, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, సూపర్‌వైజర్ అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాతలకు ధన్యవాదాలు

పులివెందుల రూరల్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పులివెందులలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన వైసిపి నాయకులు, అభిమానులు, మండలస్థాయి నాయకులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అంటూ వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగు భాషను ప్రజల్లో పెంపొందించే భాగంలో తెలుగు శాఖ యూనివర్సిటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం చేశారు. ప్రథమ, ద్వితీయ సెమిస్టర్‌లలో యూనివర్సిటీ పరీక్షలలో అవుట్ స్టాండింగ్ గ్రేడ్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ నాగలక్ష్మిదేవి తన సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రోత్సహించడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయాలను ప్రతి విభాగం చేపట్టితే విద్యార్థుల్లో మరింత ఉత్సాహం వస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగలక్ష్మి దేవి, డాక్టర్ బాలకొండ గంగాధర్, గ్రంథాలయ శాఖ అధిపతి మాధవరావు, డాక్టర్ మల్లేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజామొద్దీన్

దోమకాటు ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటు ఆరోగ్యానికి హానికరమని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మినీ సచివాలయంలో డాక్టర్ ఖాజా మొద్దీన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ మీకు కేటాయించిన ఇళ్లల్లో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు అయితే వెంటనే రక్త పరీక్ష చేయాలని సూచించారు. వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్ మాత్రమే వెళ్లాలని తెలిపారు. కార్యక్రమములో బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంతికుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్‌కుమార్, సోమలింగారెడ్డి, శేషగిరి నాయక్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గండి అంజన్నను దర్శించుకున్న 'ఆకేపాటి'

ప్రజాశక్తి - చక్రాయపేట

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి గండి వీరాంజనేయ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభదాయకమని డివిజన్ వ్యవసాయ శాఖ ఎడిఎ క్రిష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ఖాదర్‌పల్లి గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మహబూబ్ బాషా అనే రైతు పొలం వద్ద ప్రకృతి వ్యవ సాయంలో ద్రవ జీవామృతం తయారు చేశారు. అనంతరం ఎడిఎ మాట్లాడుతూ ద్రవ జీవామృతం లాభాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చులు తగ్గి, దిగుబడులు అధికంగా వస్తాయని వివరించారు. ఎఒ దేవి పద్మలత మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్‌లో తప్పక నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు సురేష్, సుష్మ, ఎంటి కృష్ణారెడ్డి, మహేష్, తేజ, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామని, విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఇఎస్ఎస్‌వి జూనియర్ కళాశాలలో బుధవారం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విద్యార్థులను కోరారు.

చైల్డ్ హెల్ప్ లైన్ సేవలకు 1098

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సేవలను విద్యార్థుల సద్వినియోగం చేసుకొని భరోసాగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తెలపవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి, భారతి, సోషల్ వర్కర్ లక్ష్మీప్రసన్న, వన్‌స్టాప్ సిబ్బంది అశ్విని, మహిళా పోలీస్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు